


# తెలిసిన వాడు

సత్తిన్నారాయణగోరికి చెయ్యెత్తి దణ్ణమెట్టొచ్చు. ఆ మారాజు మనసు అంత మెత్తంది. ఐతే ఏం గాంగ- ఆ రాముంగోరికే కట్టాలు రాంగలేంది మడుసుల సంగతి చెప్పాలో వాల్చిందేముంది? మల్లా ఆ యమ్మగోర్నంటానికి లేదు. అయగోరంటే పడిసచ్చేది. శానా కాలం గడిసింది. సిలకాగోరంకుల్లాగా వుండ మొగుడూ పెళ్ళాన్నీ సూళ్లేక ఏ బ్రగడ పుట్టించిన్నో ఏమో తెల్లారే సరికల్లా యిద్దరిమద్దా పచ్చిగడ్డేత్తే బగ్గుమంటుండది. రాదయ్యాని ఓం పెదమంగా ఆయింటో అడుగెట్టించింది సత్తిన్నారాయణ. మల్లా ఈనారం మోపి బెయిటికి నెట్టింగీ సత్తిన్నార్రాయణే. ఏపాపంఎరగనంటుండదాయమ్మ. నా కల్లు నేనే నమ్మకుండా వుండేంత అగ్గానమింకా రాలే దంటుండదు సత్తిన్నారాయణమరాయి నేం సూశిండో యెవురికీ తెల్దు. నునకి తెల్చిందల్లా యిదీ, ఐదే ళ్ళాయి మళ్లీ ఆయమ్మ మొకం సూళ్లేదుగా!

గన్నారంలో కలిగినోళ్ళ యిళ్ళలో వోటిగా పేరు దెచ్చుకుంది సత్తిన్నారాయణగోరిల్లు. ఆరినాన యెంకణ్ణస్సయ్యగోరు పైమీద ఖండవాతో ఆ వూరొచ్చిండంట. మరయ్య సత్తెకాలపు రోజులోయేమో నాయాని కూడుండేది. కలప యాపారమెట్టి దరమంగా రోజు లెల్లముచ్చాడు. ఉన్నంతలో కాళ్ళు ముడుసుకున్నడు; తాను తిన్నడు, దేయి అన్నోళ్లకింత పడేశిండు. ఆ వూరొచ్చిన యాళాయిసేసమో, ఆయన యిట్టదేముడు సత్తి నారాయణమూత్తి కటాచ్చిమోగాని ఆయన పట్టిందంతా బంగారమైంది. లేక లేక పుట్టిన ఒక్క కొడుక్కి సత్తిన్నారాయణమూత్తి పేరెట్టుకుని అల్లారుముద్దుగా పెంచిండు. సత్తిన్నారాయణైనా అల్లరి సిల్లరిగా తిరక్క బుద్దిగా సదువుకుని నలుగుర్లో ఔనని పిచ్చుకున్నాడు. ఐతే మళ్లీ పెద్దపెద్ద ఇంగ్లీసు చదువులు సవవలేదు. మిటిక్లేశం ఫేలిపోయి నాయిన నిచ్చిన యాపారం సేతుల్లో వుండగా ఈ యింగిలిపీసు దేనికని మానేశిండు. సమందాలకోసం దేశమంతా గాలించి ఆపాపయమానంగా వుండేపిగా సూసి మరీ పెళ్లిసేశిండు యెంకణ్ణసయ్య. లలితమ్మకూడా అటు పుట్టింటోరికీ ఇటు అత్తింటోరికీ పేరుతెచ్చింది.

ఇంతమటుకి కత బాగనే నడిసింది. ఇగ్గో యిక్కణ్ణే వచ్చిండి పానకంలో పుడక. రాదా కిట్టయ్య—పోనీ, రాదయ్యో అనండి ఏం ములిగిపోయింది- సత్తిన్నారాయణకు బళ్లో పరిచయమైనడు. సదువులో మటుకి మాంచి పిట్టమేనె సెయ్యి. ఈయిద్దరికీ ఎట్ట జతపడిందనేనా మీరడిగేది? యినండి మరి. అది యెంకణ్ణరసయ్యగోరి హయాం. అప్పటికీ యిప్పటికీ ఆరింటో వారాలబ్బాయిలు వుంటానె వుండరు. అంచేత

వై. యం. శర్మ

• సెప్పొచ్చే దేటంటే - అసలు పాయింటు - ఓ రోజు వారం దొరక్క దెగ్గిరున్న కాన్డబ్బుతో యేర్చినగ పప్పు ల్దిని దేవుడిగుల్లో పడుకునుండ రాదయ్య నింటికి దెచ్చి కూడెట్టించి తన్తో నే వుంచేసుకున్న డియ్యాల్టిదాకా సత్తిన్నారాయణ. ఈ మేలు రాదయ్య యీనాటికీ మరవలేదని సీకుట్ట పరవాత్తుడిమీన వొట్టెట్టి సెబుతుంటను నమ్మండి.

మరి యీ తిరకాసేంటని మీరడగొచ్చు. యెంకణ్ణరసయ్య కొడుక్కి సిన్నప్పట్నుంచీ ఉగ్గుబాలతో నూరిపోసిండు, ఏంటీ? పేదోళ్ళకు మంచీ సెబ్రా తెలీదనీ, పెతి సిన్న సంగతికీ తేలిగ్గా కక్కూరితి పడతారనీ, యీళ్లకి అతిగా నమ్మి మనుసియ్య కూడదనీనీ. ఆయన బీదోడుగా పెరిగి డబ్బు సేసుకుని తేల్చిన అరవైయేళ్ల చారాంశ మది,మనం తేలిగ్గా కొట్టిపారెయ్యడానికిల్లేదు మరి. ఇందుకనే పెతి ఇసయంలోనూ సత్తిన్నారాయణకి రాదయ్యంటే మాలావు అనుమానం. పైగా 'మన యింటో తింటుండడా మరి, మన మాటకేనా యెందుకొప్పుకోకపోవాలి? యింతమాత్తరం పెతిపలం సూపకూడదా నాకు !' అనుకుం టుండే వాడు. ఐతే ఒక్క సత్తిన్నారాయణకేనా యిట్టాటి వుద్దేశ వుండదని మీరనుకుంటం? ఎబ్బే! అదేమి సిత్రమో, రాదయ్య వుద్దేశమూ అంతే. అందుకుని సత్తిన్నారాయణ సెప్పే పెద్దానికి తప్పని తెల్చినా సరే ఔనా నని బుర్రూపుతుండేవాడు రాదయ్య. తన మాట సెగ్గినప్పుడు సత్తిన్నారాయణ కోప మొచ్చి ఓ మాటన్నా నన్నుకాదనుకుని దులుపుకు పోతుండేవాడు. సాయన సెప్పిన మాటలన్నీ యీ రాదయ్యని సూసి గట్టిసేసుకున్నడు సత్తిన్నారాయణ. పాపం, లలితమ్మా లేనోరింటి పిల్లే కావటంశాత ఆయన అనుమానాల గ్గురయ్యిందు కాటేకాలం పట్టిలా. అసలు చిక్కేటంటే తానెంత బీదోళ్ల పిల్లయినా, తనకు బయిమూ, బకితీ వున్నయ్యనీ, తన తెలివి తాటలు సంపుకుని ఆయన సెప్పిందల్లా వొప్పుకోనసీ ఆయమ్మ అంటంతో వొచ్చిందితంటా.

రాదయ్యకు పెద్దైనాక కూడా ఆ యింటి కూలిమి పోలా. పైగా తానా యింటికి బుణం పడి వున్న డబ్బు తీరిసేసిగాని బెయిటి కడుగెట్ట దల్చుకోలే దాయన. సదువుసందె లైపోయి నాలుగు డబ్బు ల్దెచ్చుకుంటుండా కూడా నా యి ల్లొదిలి పోవేంవని సత్తిన్నారాయణ బోలెడన్నిమాట్లు మందలించిండు, కాని లాబం లాకపోయింది. నిలెత్తు మనిసి అడిగిందానికి బదులు సెప్పకపోతే యేరికైనా కోప మొత్తుంది. ఇక సత్తిన్నారాయణ మాట అడిగేదేంటి? అసలీ రాదయ్యో రకం మనిసిలే !—ఏం? నెలకు రొండొందల ల్దెచ్చుకుంటుండోడు, టింగురంగా అంటూ కాలుమీన కాలేసుకుని సుకంగా కూసోక, ఓరి మోసేతి కింద నీల్లు తాగేంత కరమ్మేం?— ఆ రొండొందలూ తెచ్చినియ్యి తెచ్చినట్టు లలితెమ్మ కిచ్చేవోడు. గుడ్డా గోసీలకని పాప మాయమ్మే యా బైరూపాయ లిచ్చేసి మిగతాది యింటి కర్చుకి వాడేది. సేయితుడి దెగ్గిర డబ్బుచ్చుకుందుకు మొగమాట పడేవోడుగాని, లలితమ్మకు రాదయ్య డబ్బిత్తుంటే మాత్తరం ఊరుకుండే వోడు సత్తిన్నారాయణ. లేని రోజుల్లో యింటో పడి తిన్నది సాలదా యింక యిప్పుడూ మేపటం బుద్ధి పొరపాటని ఆయన వుద్దేశం.

యిట్టాగన్నా కాలం గడిత్తే బాగుండేపోను. ఏ మనుమానించిండో మరి ఓనాడు 'నా యింటో నుంచి పో అవతల'కని గట్టిగా గదమాయించిండు. ఆ పళంగా రాదయ్యకు కళ్ళనీళ్ళ పరెంతరమైంది. ఆయన ఆరాట మీళ్ల కరదం గాదు. చంగ తెల్చుకున్న లలితమ్మ మాత్తరం ఆనాడు తెగించి 'రాదయ్య మనింటో వుండదల్చుకున్నాన్నాళ్లూ ఆయి న్నిక్కణ్ణే వుణ్ణియ్యండి. ఇన్నాళ్లూ యీడ పెరిగి ఇప్పుడేడకి లేసిపోతడు?' మరియాదగా సరిదిసెప్పింది మొగుడికి. ఏ గుణానున్నడో తలూపిండు సత్తిన్నారాయణ. కానట్టా వుణ్ణిత్తుందా పాడు లోకం? రాదయ్య కేదో మందెట్టి వల్లో యేసుకుందీ జాణని జంకేవోళ్లు సాటునా, జంకనివోళ్లు మొగానా నోటికొచ్చినట్లల్లా ఆడిపోసుకున్నరు. రాన్రాను సత్తిన్నారాయణ కూడా నలుగురి మాటేపు బుర్రొంచక తప్పిందికాదు. తెల్చిందా యెవార మెట్ట దిరి గెట్టొచ్చిందో ?

అటు రాదయ్యానూ యిటు లలితమ్మనూ సెరోయేపూ గెంటెయ్యటమైతే సేసిందుగాని పాపమా మారాజు పిచ్చెత్తినట్టయి కాలుగాల్న పిల్లల్లే తిరుగుతుండేవోడు. కానైతే నిబ్బరమైన గుండె కాబట్టి లలితమ్మను మళ్లీ తెచ్చుకోమని యెవురెన్ని సెప్పినా యినిపిచ్చుకోలేదు. మా పట్టుదల మనిసి. పాప మా యమ్మ ఇన్నాల్లూ నీడల్లే కనిపెట్టుకు నుండేదాయిన్ని. సీకటితో పందుంపుల్ల దగ్గిర్నించి రేత్తిరి సెక్కముక్కల్దాకా యేనిమిశా నేంగావాలో వైనవైనంగా తెల్చుకు నందిచ్చేది. అట్టాటమ్మ లేనింటో వుంటవంటే యెవురికేనా పానాలు బిక్కుబిక్కు మంటై. వుండబట్టలేక చాయింత్ర పేళకా త్తట్టా కిట్టకాలవకేసి పోయొత్తుండేవోడు. ఆయాల కనిపెట్టి చోకుసేసుకుని రోడ్డుమీనకున్న గుమ్మంలో ఆయన దోవ కెదురూగ్గా నిలబడేదాన్ని. ఓనాడేం, బాగా పొద్దుగూకుమాట్ట అప్పుడే నీళ్లోసుకుని ముత్తాబు సేసుకుంటుండను. మా తమ్ముడొచ్చి 'అక్కాయక్కాయ్, బేసైన పద్దేవ్!' అన్నడు. 'పద్దేంటిరా నీ నాలికిడ్సా' అని నవ్వుకుంటూ గుమ్మంలో కొచ్చి రోడ్డంట యిట్టా సూతునుగందా, కోరమీసం, యీల పాటా, యెగదువ్విన కిరాపూ, సిలుకు లాల్చీ ...యిగనేం, ఆ రోజునుంచీ మా యింటికో టిక్కట్టుచ్చీసుకున్నడు సత్తిన్నాయణ.

పరిత్తితు లిట్టా తారుమారుకాటం రాదయ్య సూత్తా వూర్కోలేకపోయిండు. సొయింగా ఎల్లి సత్తిన్నారాయణ కాళ్లు రెం డట్టుకుని 'తప్పంతా నాది ఛమించు. నేను మీ యింట్లో నించి యెట్టాగూ యెల్లిపోనే పొయ్యాను, ఇంక రాను. నా కోసరం నీ బతుకిట్టా పాడుసేసుకోమాక. పాపం లలితమ్మ తప్పేం లేదు. ఆ యమ్మను తెచ్చుకుని కాపరమెట్టుకో' మని బతిమాలి చెప్పిండు. ఎంతమందికాతనో చెప్పించిండు. ఊహుఁ హుఁ! ససేమిరా! యింటేనా? కొయ్య! ఆయన కా కోపమూ తీరలేదు. ఈయనకీ తాపమూ తగ్గలేదు.

సత్తిన్నారాయణ పెదిలీగ్గానే వొత్తున్నడు మా యింటికి. నాకో కానీ ముట్టజెప్పిండు గూడా. నేనేనా యాసటగొన్న ఆయన పానాన్ని కాతనైనంతమటుక్కి సంతోసపెడుతుండనేగాని ఆశాపాతకంగా ఆయిన్ని పీడిచ్చుదల్చుకోలేదు. కాని రాదయ్య పోరుమాత్తరం మా యింటిని యిడవలా. ఓనాడు సత్తిన్నారాయణ లేకుండా సూసి నా దగ్గిరకొచ్చిండు రాదయ్య వొంటరిగా. నలుగురికి మల్లేనే ఆయిన్నీ లోనికి తీసుకెల్లి కురిసీ యేసి కూసోబెట్టాను. ఆయన మొగాన మాత్తరం యావ బాగా కనిపిత్తుండది.

'ఏం? అట్టావుండారేం? అల్చిపో యొచ్చినట్టుండారు. కాసి న్నేడేడి పాల్దెత్తాను పుచ్చుకోం' డన్నాను చీరసెంగుతో ఆయన మొగం తుడుత్తూ.

'పాలూ వొద్దు, బండలూ వొద్దు. కాంతం! నిన్ను పొగుడుతున్నా ననుకోమాక. యిన్నాన్నీ సంగతి.డబ్బుకి కక్కురితిపడే దానివి కావనీ, బతికినందుకు లోకానికి చాతైన సాయం చెయ్యటమే పనిగా పెట్టుకుండా వనీనీ.'

'ఏంటేంటో పెద్దమాట లనేత్తుండా ర్నన్నట్టుకుని. మీకు నావల్లయ్యే సాయం యావన్నా వుంటే సెప్పండి. తప్పకండా శాత్తాను. అంత మాత్తరం సెయ్యలాకపోతే పెజల్ని పీడించి వొడుక్కున్న డబ్బు మాకు వొంటబట్టదు.'

'ఉంది, నీ సేతులోనేవుంది! శాత్తానంటే సెపుతాను.'

'దేవుఁ డంటోరు మీ రేంటి- పాపిట్టి ముండన్న న్నొచ్చి ఇంతగా బతిమాల్ట మేంటి? సెప్పం డదేంటో, త లడ్డెట్టన్నా శాత్తాను.'

'సేతులో సెయ్యేయ్.'


సె య్యేశాను.

'అంతమాత్తరం నమ్మకం లేదేంటండి? సత్తిన్నారాయణగార్ని గురించేనా?'

'అవును.ఇయిగో,యీ రూపాయిలు తీసుకో.' పచ్చకాయితాలు పది లెక్కెట్టియ్యొచ్చాడు.

'అయేంటండి? అంత పడిపోలేదు మే మింకా. మీరు మావల్ల సంతోషపడి మా కిత్తుండ డబ్బు సాల్ను. ముదనట్టపు డబ్బు తీసుకుని బాగుపడం. ఉంచండి.' నిరగాంత పోయిండు రాదయ్య.

'కాంతం, పెతి నీచుడికీ అందుబాటులో వుండే నీ కింత లోతైనగుండె వుండా దనుకోలేదు నేను, ఛమించు.'



'ఎంత మాటండి!' అన్నాను. ఎంతసేపూ లలితమ్మనీ, సత్తిస్నారాయణ్ణీ జత సెయ్యాలని సెత్తీ నోరూ మొత్తుకున్నడు. పాపమా మానవుణ్ణి సూత్తే జాలేసింది.

'సేతులో సెయ్యేశాను గందా మీకు సాయం శాత్తానని. అన్నమాట తప్పను. సెప్పండేం సెయ్యమంటారో. అగ్గిలో దూకేందుకన్నా సిద్దంగున్నా'నన్నాను. అవళంగా ఆయన గుండి పొంగిపోయింది. గబుక్కుని నా సెవుకాడికొచ్చి గుసగుస లాడిండు.

'అమ్మ బాబోయ్! ఎంత టోరండీ?' అన్నా నాయన గొప్పతనం తెల్సుకుంటూ. ఆ రోజు కాయ సెల్లిపోయిండు. మర్నాడు సందేళ. రోజూ మల్లేనే సత్తెస్నారాయణొచ్చి తలుపు తట్టిండు. నేనేం పలకలేదు. మళ్ళీ తట్టిండు. ఊహూం. పలకలేదు.

'కాంతం-' మెల్లిగా పిల్చిండు. పలకలేదు.

'కాంతం!' కోపంగా పిల్చిండు. యాభైనా పలకలేదు. వొళ్ళు సెట్టుతో పడేలుమని తలుపు తెరుచుకుంది. చివాల్న లోనకి నెట్టుకొత్తున్నోడలా అట్టనే కొయ్యైపోయిండు సత్తిస్నారాయణ. ఆ సమయానా నేనూ రాదయ్యా ఒకర్నొకరం సేతులు పెనేసుకుని కావిలిచ్చుకునున్నం.

కంగారుపడి రాదయ్యను లోనికి బంకి ఎదురొచ్చి సత్తిస్నారాయణ్ణి కావిలిచ్చుకుని తీసికెళ్ళి కురిసీలో కూసోబెట్టి, 'ఇయ్యాలింత తొందరగొచ్చిరేం?' ఆపేచ్చగా అడిగాను. ఆయనా సూసిందంతా మర్చిపోయినట్టు నన్ను దగ్గిరికి లాక్కుని శంపలు నిమురుత్తా-

'కోయిలమాత వింటూ యింటో వొక్కణ్ణీ వుండలాకపోయా' నన్నడు.

'ఐతే, మరి- లలితమ్మ గోర్ని తెచ్చుకో రాదూ? ఇల్లు కళకళ్లాడుతుండది!' అన్నానవుతా.

'ఈ జలమలో అ జ్జరగదనుకో. కుక్కముట్టుకున్న కూడ్డీనేంత పసువును కా' నన్నడు రోసంగా.

పొట్ట సెక్కలయ్యేట్టుగా వొచ్చే నవ్వాపుకుని, 'మరి నన్నో!' అన్నాను.

'అదేంవన్నమాట? నీసంగతే యేరు. ఆవురితే జీవనంగా పెట్టుకున్నదానివి నువ్వెవర్నన్నా జారదీత్తావు. నిన్ను యెవురన్నా కారదియ్యొచ్చు.'